Follow: @ANNTELUGU WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు

మహా పత్రిక

స్పెషల్ ఎడిషన్

Special Edition



# నాగోబా జాతర సందడి



## దేశంలోనే రెండో అతిపెద్ద ఆదివాసీ గిరిజన సంబరం

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో కొలువైన నాగోబా

ఏటా పుష్యమాస అమావాస్య అర్ధరాత్రి మహా పూజ

5 రోజుల పాటు జాతర ఉత్సవాలు

ఈనెల 28న మహా పూజ.. 31న దర్బార్

వివరాలు 2లో

మహా పత్రిక
ANN తెలుగు
Follow: @ANNTELUGU WWW.EPAPER.MAHAADAILY.COM



# నాగోబా జాతర సందడి

## ప్రచార రథం

జాతరకు సంబంధించి పలు ఘట్టాలు మొదలయ్యాయి. ఈనెల 2న నెలవంక కనిపించిన తెల్లవారి మురాడిలో ఉమ్మడి జిల్లాలోని మెస్రం వంశీయులు కేస్లాపూర్లో నాగోబా మురాడి వద్ద పీఠాధిపతి మెస్రం వెంకట రావు నేతృత్వంలో సమావేశమై. ప్రచారయాత్ర, గంగాజలయాత్ర, మహాపూజ, జాతర నిర్వహణపై చర్చించారు.మురాడిలో ప్రత్యేక పూజల అనంతరం రథాన్ని ప్రారంభించారు. గ్రామపొలిమేర వరకు మెస్రం వంశంలోని అల్లుడు కచ్చలం నడపగా అక్కడి నుంచి ఆలయ కటోడాల ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగించారు. ముందుగా ఆనవాయితీగా సిరికొండ మండల కేంద్రంలోని కుమ్మరి వద్ద మహాపూజకు అవసరమయ్యే కుండల తయారీకి ఆర్డరిచ్చారు. ఏడు రోజుల పాటు ఈ ప్రచార రథం సిరికొండ , రాజంపేట్ ,కొలాడి , సోయం గూడ, గిన్నెర , సాలెవాడ, వడగావ్ గ్రామాలలో జాతర కార్యక్రమాల గురించి ప్రచారం చేపట్టి తిరిగి ఈనెల 9వ తేదీన కేస్లాపూర్ కు చేరుకుంది.

## గోదావరి జలం కోసం పాదయాత్ర

అనంతరం రెండవ ఘట్టం పవిత్ర గోదావరి జలం కోసం పాదయాత్ర మొదలైంది. మెస్రం వంశీయులు తెల్లని వస్త్రాలు ధరించి మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని హస్తిన మడుగు కు కాలినడకన ప్రయాణ మయ్యారు.ఈనెల 17న అక్కడకు చేరుకుని గోదారమ్మకు ప్రత్యేక పూజలు చేసి తమ కలశాలలో గోదావరి నీరు నింపుకుని వంటలు వండుకుని భోజనం చేసి తిరిగి కేస్లాపూర్ కు బయలు దేరుతారు.ఈ నెల 24న ఇంద్రవెల్లి లోని ఇంద్రాదేవి కి పూజలు చేసి 25న కుటుంబ సమేతంగా ఎడ్ల బండ్లపై కేస్లాపూర్ కు చేరుకుంటారు. అక్కడ ఇంద్రాదేవి వెలిసినందువల్లే ఇంద్రవెల్లి అని పేరు వచ్చిందని కథనం.

దేశంలోనే రెండో అతిపెద్ద ఆదివాసీ గిరిజన ఉత్సవం నాగోబా జాతర. సర్పజాతిని పూజించడమే ఈ పండగ ప్రత్యేకత. ఈ అమావాస్యరోజు తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేషనారాయణమూర్తి) పురివిప్పి నాట్యమాడుతాడని గిరిజనుల నమ్మకం. అమావాస్య నాడు సరిగ్గా సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడనీ,వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్యమవుతాడని గిరిజనులు విశ్వసిస్తారు.ఆదివాసీ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా దేవాలయం ఆదిలాబాద్ పట్టణానికి 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్ గ్రామంలో ఉంది. ఈజాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. జాతర సమయాలలో ఆదివాసీలతో పాటు లక్షలాది మంది దర్శించుకుంటారు..నాగోబాను కొలిస్తే పంటలు బాగా పండుతాయని, శాంతి విరాజిల్లుతుందని, రోగాలు నయమవుతాయని గిరిజనుల విశ్వాసం.

- మహా, ఆదిలాబాద్



మిగతా 3లో

మహా పత్రిక
ANN తెలుగు
Follow: @ANNTELUGU WWW.EPAPER.MAHAADAILY.COM

# నాగోబా జాతర సందడి



## మహా పూజ

కేస్లాపూర్ గ్రామంలోని మర్రి చెట్ల వద్దకు చేరుకోని మూడు రోజులపాటు అక్కడ సాంప్రదాయక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఈనెల 28వ తేదీన అర్థరాత్రి అమావాస్య రోజు హస్తిన మడుగు గోదావరి నుండి సేకరించిన పవిత్ర గోదావరి జలాలతో నాగోబాకు అభిషేకం నిర్వహించి, ఆలయాన్ని శుద్ధి చేసి, మహాపూజను ప్రారంభించ నున్నారు.మహా పూజ అనంతరం 5 రోజుల పాటు జాతర ఘనంగా నిర్వహిస్తారు. నాగోబా పూజల అనంతరం నాగోబా ఆలయ ఆవరణలో ఉన్న పుట్టను మట్టితో మెత్తడంలో మేస్రం వంశీయుల అల్లుళ్లకు పెద్దపీట వేస్తారు. అల్లుళ్లు మట్టిని కాళ్లతో తొక్కి మెత్తగా చేస్తే కూతుళ్లు ఆ మట్టితో పుట్టను మెత్తి (అలికి) మొక్కులు తీర్చుకుంటారు. అల్లుళ్లు మట్టిని తొక్కినందుకు వారికి ప్రత్యేక నజరానా అందజేయడం సంప్రదాయం.

## 22 పొయ్యిలు

జాతరకు వచ్చే మేస్రం వంశీయులు వేలాది మంది ఉన్నా వారు వంట చేసుకునేది మాత్రం 22 పొయ్యిల మీదే. ఈ పొయ్యిలు కూడా ఎక్కడపడితే అక్కడ పెట్టడానికి వీల్లేదు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ లోపల, గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు (దుగుడు) ఉన్నాయి. ఆ దీపాల కాంతుల వెలుగులో 22 పొయ్యిల్లో మేస్రం వంశీయుల వంతుల వారిగా వంటలు చేసుకుంటారు. మిగితా జాతుల వారు వారికిష్టమైన చోట వంటలు చేసుకుంటారు.





మహా పత్రిక
ANN తెలుగు
Follow: @ANNTELUGU WWW.EPAPER.MAHAADAILY.COM



# నాగోబా జాతర సందడి

## భేటింగ్

మెస్రం వంశస్థుల్లో వివాహమైన నూతన వధువులను తప్పక కేస్లాపూర్‌లో నాగోబా దేవుని వద్దకు తీసుకెళతారు. ఆమె చేత దేవునికి పూజ చేయించి వధువును పరిచయం చేస్తారు. దీన్నే 'భేటింగ్ కీయ్‌వాల్' అంటారు. ఎప్పటి వరకైతే మెస్రం తెగ వధువు ఈ పరిచయ వేదికలో పాల్గొనదో అప్పటి దాకా వారు నాగోబా దేవుణ్ని చూడడం, పూజించడం నిషిద్ధం. వధువులు ఇంటి నుంచి ఎడ్లబండి వెనుక వెదురు బుట్టలో పూజసామాగ్రిని పట్టుకొని, కాలినడకన బయలుదేరతారు. కేస్లాపూర్‌లోని నాగోబా గుడిని చేరుకుంటారు. పరిచయం చేయాల్సిన వధువులను 'భేటి కొరియాడ్' అని పిలుస్తారు. వధువులు ఇద్దరు చొప్పన జతలుగా ఏర్పడి ముఖం నిండా తెల్లటి దుస్తులతో ముసుగు ధరిస్తారు. పూజా కార్యక్షికమానికి ముందు నాగోబా దేవుని దగ్గరకు వారిని తీసుకెళ్లి పరిచయం చేస్తారు.





## దర్బార్

ఈ జాతరలో కీలమైన మూడోరోజు నిర్వహించే గిరిజన దర్బార్ ఈ నెల 31న జరగనుంది. స్వాతంత్ర్యం రాకముందు నిజాం పాలనలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసిస్తున్న తండాలు, గూడేలకు, గ్రామాలకు కనీస సౌకర్యాలు ఉండేవి కావు. ఆదివాసీల జీవన విధానంపై అధ్యయనం కోసం ఆస్ట్రియాకు చెందిన హైమన్ డార్ఫ్ దంపతులను ఈ ప్రాంతానికి పంపారు.ఆ దంపతులను నాగోబా జాతర ఆకర్షించింది..జాతర మూడవ రోజున వారి సమస్యలు తెలుసుకునేందుకు సమావేశం నిర్వహించేవారు..దానినే దర్బార్ గా పిలిచేవారు. ఈ దర్బార్ లో ఆదివాసీల సమస్యలను తెలుసుకొని నిజాం ప్రభువుకు అందించేవారు. అలా తొలిసారి 1942లో దర్బార్ నిర్వహించారు. అదే ఆనవాయితీగా కొనసాగుతోంది. స్వాతంత్ర్యానంతరం జిల్లా కలెక్టర్ , ప్రజా ప్రతినిధుల సమక్షంలో దర్బార్ జరుగుతుంది. జాతర పూర్తయ్యాక అక్కడి నుంచి శ్యాంపూర్‌లోని (బోడుందేవ్) జాతరకు వెళ్లి ఎవరి గృహాలకు వాళ్లు వెళతారు.ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.